రాజరాజేశ్వరీ... రక్షమాం



ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అలంకారం



ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయంలో రాజరాజేశ్వరి అలంకారం



దువ్వూరులో శ్రీమత్కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారం



మైదుకూరు అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



ప్రొద్దుటూరులోని అమ్మవారిశాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సెట్టింగ్



కలసపాడు: బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు




ప్రొద్దుటూరు కల్చరల్ : గౌరమ్మ కట్టలో రాజరాజేశ్వరి అలంకారం



పోరుమామిళ్ల: శ్రీ మహావిష్ణువు అలంకారంలో వెంకటేశ్వరస్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకారం



బద్వేలు అర్బన్ : అమ్మవారిశాలలో కన్యకాపరమేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవీ శరన్నవరాత్రుల తొలి రోజు అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా, ఆదిలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు భక్తులకు రాజరాజేశ్వరిదేవిగా దర్శనం ఇచ్చారు. వాయిద్య గణపతులు, పలు దేవతా విగ్రహాల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. శ్రీమహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారు ఆదిలక్ష్మీదేవిగా, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, శివాలయంలో, గౌరమ్మ కట్టలో అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో గణపతి రూపాలు, వివిధ దేవతా మూర్తుల బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకుంది.

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ఆలయాలలో దసరా పండుగలో భాగంగా దేవీశరవన్నవరాత్రుల ఉత్సవాలను గురువారం వైభవంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక మహాలక్ష్మి ఆలయం నుంచి 108 వెండి కలశాలతో మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారిశాలలోని అమ్మవారికి అభిషేకం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఊరేగింపులో భాగంగా ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారిశాల, కోదండరామస్వామి దేవాలయం, మహాలక్ష్మీదేవి ఆలయాలతో పాటు వీరభద్రస్వామి ఆలయం, పోలీసుస్టేషన్ ఆవరణలోని దుర్గమ్మ ఆలయాలలో దసరా ఉత్సావాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించి వివిధ రకాల అలంకారాలు చేస్తున్నారు. తొలిరోజు ఏర్పాటుచేసిన దేవతామూర్తుల అలంకారాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిశాలలోని అమ్మవారు కన్యకాపరమేశ్వరీదేవి నిజస్వరూప అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే మహాలక్ష్మీదేవి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అలాగే కోదండ రామాలయంలో మత్స్యావతారం అలంకారంలో స్వామి వారు దర్శనమిచ్చారు. భక్తులకు ఆయా ఆలయాల్లో తీర్థ ప్రసాదాలను అందచేశారు. అలాగే ఆయా ఆలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు

బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో అమ్మవారు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గురువారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు బాలత్రిపురసుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉభయదాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి సుదర్శన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీ భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం దసరా ఉత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. ఉత్సవాలు 3 వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధ్యక్షుడు చాటకొండు వెంకట సుబ్రమణ్యం, కార్యదర్శి విశ్వనాథుల జనార్ధనశెట్టి తెలిపారు.

శ్రీ వెంకటేశ్వరస్వామికి ఉభయం

శ్రీ లక్ష్మీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు గురువారం మాజీ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్పర్సన్ కృష్ణమ్మ ఇంటి నుంచి మొదటి ఉభయం స్వామికి ఇచ్చారు. పీఆర్ ఆర్డీ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, రిటైర్డ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మార్కారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శారదమ్మ, చైతన్యారెడ్డి స్వామికి ఉభయం సమర్పించారు.

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు

మైదుకూరు : స్థానిక అమ్మవారిశాలలో వాసవి కన్యకాపరమేశ్వరి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక భీమేశ్వరస్వామి ఆలయంలో మాధవరాయస్వామి యూత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పార్వతి దేవికి బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన నిర్వహించారు.

దువ్వూరు : స్థానిక శ్రీమత్కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గొల్లాపిన్ని లక్ష్మీనరసింహమూర్తి శర్మ, గొల్లాపిన్ని ఫణీంద్రకుమార్ శర్మ అమ్మవారికి క్షీరాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించి బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పూలతో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరించారు. తొలి రోజు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షుడు ఆరవేటి సుబ్బారావు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



ప్రొద్దుటూరు: కలశాలతో ఆర్యవైశ్య సుహాసినులు



ప్రొద్దుటూరులో చిన్నారుల కోలాటం



సంస్కృతి వాద్యపథక్ కళాకారుల ప్రదర్శన

దసరా ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలి



రాచమల్లు శివప్రసాదరెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యసభ కార్యదర్శి నాగేశ్వరరావు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రజలు దసరా ఉత్సవాలను కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. దసరా ఉత్సవాల ప్రారంభం సందర్భంగా రాచమల్లు కుటుంబ సమేతంగా గురువారం శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సభ కార్యదర్శి నాగేశ్వరరావు .. రాచమల్లు దంపతులను ఆలయ మర్యాదలతో అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమంలో రాచమల్లు సతీమణి, కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు టంగుటూరు మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు తొండలదిన్నె రాజారాంరెడ్డి, గోపల్లె గోవర్ధన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విధుల్లో చేరిన సీసీలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి వైఎస్సార్ క్రాంతిపథం కమ్యూనిటీ కోఆర్డినేటర్లు గురువారం విధుల్లో చేరారు. ఈశ్వర్‌రెడ్డినగర్ సీసీగా కె.మల్లికార్జునరెడ్డి, తాళ్లమాపురం సీసీగా టి.ఓబులేసు, దొరసానిపల్లె సీసీగా టి.రమేష్‌బాబు విధులలో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న రాణి విద్య దువ్వూరుకు, గురుశేఖర్ పెద్దముడియంకు, కళావతి ఖాజీపేటకు బదిలీ అయ్యారు.

హాస్టల్‌లో బియ్యం సక్రమంగా ఉన్నాయి



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్

కాశినాయన : నరసాపురం ఎస్సీ బాలుర హాస్టల్‌లో బియ్యం నిల్వలు సక్రమంగా ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన హాస్టల్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. 18 క్వింటాళ్ల 3 కేజీల బియ్యం నిల్వ ఉన్నట్లు రికార్డుల్లో ఉందని, బియ్యం కూడా నిల్వ ఉన్నాయని తెలిపారు.

గెజిట్ ప్రకారమే టికెట్ ధరలు వసూలు చేయాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ గెజిట్ ప్రకారమే ఎగ్జిబిషన్‌లో టికెట్ ధరలను నిర్ణయించి అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీకి చెందిన ఆర్‌పీ చలపతి అనే వ్యక్తి రూ.1.75 కోట్లతో ఎగ్జిబిషన్ వేలంపాట దక్కించుకున్నారు. ఈ ప్రకారం ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుం పెద్దలకు రూ.25, పిల్లలకు రూ.15తోపాటు పార్కింగ్ రుసుం సైకిల్‌కు రూ.5, మోటార్ సైకిల్‌కు రూ.10, కారుకు రూ.20 చొప్పున వసూలు చేసేలా గెజిట్‌లో పేర్కొన్నారు. పిల్లల ఆట వస్తువులతోపాటు వినోదానికి సంబంధించిన అన్ని వస్తువులకు ఇదే ప్రకారం టికెట్లు వసూలు చేయాలని కోరారు. కాంట్రాక్టర్ కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మున్సిపాలిటీకి డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు ఎగ్జిబిషన్‌లో ప్రవేశ రుసుం లేకుండా ఉచిత ప్రవేశాన్ని కల్పించారన్నారు. అలాగే మున్సిపల్ పార్కుల్లో కూడా ఎక్కడా ఎంట్రీ ఫీజు వసూలు చేయడం లేదన్నారు.

నీటి వృధా అరికట్టేందుకు సహకరించాలి



నీటి వృధాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలో నీటి వృధాను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వెంగమాంబనగర్‌లో నీటి సరఫరాను పరిశీలించిన ఆయన కొందరు నీటిని వృధా చేస్తూ వీధుల వెంబడి అపరిశుభ్రత చేస్తున్న వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో చాలా వరకు నీటివృధాను అరికట్టి తాగునీటి సమస్యను కూడా పరిష్కరించామని అన్నారు. రాబోవు రోజుల్లో ప్రతిరోజు నీటి సరఫరాను చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.5 వేలు పైన పన్ను బకాయిలు ఉన్నవారు 2 వేల మంది ఉన్నట్లు గుర్తించామని, వీరందరూ ఆస్తి, నీటి పన్నుతో కలిపి రూ.9 కోట్లు బకాయిలు ఉన్నారని, వీరంతా సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అలాగే పట్టణంలోని చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయని, దీని ద్వారా చుట్టుపక్కల నివాసం ఉన్న వారికి అసౌకర్యంగా ఉందని, తక్షణమే సంబంధిత స్థల యజమానులు ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మద్యం విధానాన్ని రద్దు చేయాలి



ప్రొద్దుటూరు రాజీవ్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : నూతన మద్యం విధానాన్ని రద్దు చేయాలని స్థానిక రాజీవ్ సర్కిల్‌లో గురువారం అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం మాట్లాడుతూ నూతన మద్యం విధానాన్ని సవరించి మద్యం షాపులు తెరిచి ఉంచే సమయాన్ని సాయంత్రం 5 గంటల వరకు కుదించాలని తెలిపారు. మద్యం, గంజాయి కారణంగా మాహిళల మీద దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. గుజరాత్, బీహార్, మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల్లో మద్యం నిషేధం అమలులో ఉందన్నారు. మద్యం షాపులను ప్రైవేటుకు అప్పజెప్పడం వలన విచ్చలవిడిగా నియంత్రణ లేకుండా వ్యాపారం చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు అండగా ఉంటామని చెప్పి ప్రజా వ్యతిరేక విధానాలను తీసుకురావడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, ఐద్వా పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, సర్వేశ్వరి, రాములమ్మ, ఝాన్సీ, విజయ, సీతమ్మ, గురమ్మ, పుష్పలత, సీపీఎం నాయకుడు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు



ఆకులనారాయణపల్లెలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ

మైదుకూరు : వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని మండలంలోని వనిపెంట అటవీ రేంజి డీఆర్ఓ అన్వర్ హుస్సేన్ తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని గంగాయపల్లె, కరుణగిరి గ్రామాల్లో కళాజాత ద్వారా వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు. ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణుల వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రేంజి ఎఫ్‌బీఓలు, ఏబీఓలు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

కాశినాయన : ప్రతిఒక్కరూ వన్యప్రాణులను సంరక్షించాలని ఎఫ్ఎస్ఓ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆకులనారాయణపల్లె లో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఎఫ్ఆర్ఓ రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఓ వెంకటరెడ్డి ప్రజలకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్లు జనార్దన్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

భూమి ఆన్‌లైన్ కోసం పడిగాపులు

స్పందించని రెవెన్యూ అధికారులు



బాధితురాలు బి.లక్షుమ్మ

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి పంచాయతీలోని బోడుగుండు పల్లె గ్రామానికి చెందిన బాలుపల్లిలక్షుమ్మ అనే మహిళ తన సొంత రిజిస్టర్ భూమి ఆన్‌లైన్ కోసం సంవత్సరం రోజులుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మునెల్లి గ్రామ పొలంలో సర్వే నంబర్ 2704-7లో 1.83 ఎకరాల భూమి ఉందని, అందుకు సంబంధించి రిజిస్టర్ దస్తావేజు కూడా ఉన్నాయని తెలిపారు. భూమిని ఆన్‌లైన్‌లో పొందు పర్చేందుకు 09-06-2023న స్పందన కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓకు అర్జీ కూడా ఇచ్చానని పేర్కొన్నారు. అడిషనల్ ఆఫ్ న్యూ సర్వే నంబర్ కింద జేసీ లాగిన్‌లో చేయాల్సి ఉందని, అందుకు సంబంధించి బి.కోడూరు మండల తహసీల్దారు కార్యాలయం వారిని ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన నివేదికలను తయారు పంపించాల్సిందిగా ఆర్డీఓ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. అప్పటి నుంచి తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

కుడా వైస్ చైర్మన్‌గా అదితి సింగ్



కడప కార్పొరేషన్: కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) వైస్ ఛైర్మన్‌గా ప్రస్తుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌ను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు వైస్ ఛైర్మన్‌గా ఉన్న వైఓ నందన్ సీడీఎంఏ డీడీగా బదిలీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం జేసీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

అవసరం మేరకూ ఎరువులు వినియోగించాలి



నెర్రవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ సిబ్బంది



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చాపాడు : వరి పైర్లలో అవసరం మేరకు మాత్రమే యూరియా ఇతర రసాయన ఎరువులను వినియోగించావాలని వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాలలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది రైతులు అధికంగా వరి సాగు చేపట్టారన్నారు. ఈ క్రమంలో వరి పైర్లకు అధిక మోతాదులో యూరియా, ఇతర రసాయన ఎరువులను వినియోగించరాదన్నారు. వరి నాట్లు వేసే క్రమంలో రెండు మూడు పిలకలను తుంచి నాడటం వలన ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కాలి బాటలను తప్పనిసరిగా వదలాలని దీని వలన పైరుకు కావాల్సిన గాలి అందుతుందని, ఇదే క్రమంలో పురుగుల మందులు పిచికారం చేయటం, ఎరువులు చల్లుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. గ్రామాలలో నిర్వహించిన వ్యవసాయ అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో గురువారం వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి, పత్తిపంట యాజమాన్యంలో సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా వరిపంటలో సుడిదోమ యాజమాన్య పద్ధతులు, పిచికారీ చేయాల్సిన మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో వీఏఏ గురులక్ష్మి, ఏపీసీఎంఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చౌటపల్లెలో..

అట్లూరు : మండలంలోని చౌటపల్లె గ్రామంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట పొలాలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. బద్వేలు సహాయ వ్యవసాయ సంచాకులు ఎం.నాగరాజ చౌడు భూములను బాగు చేసుకునే పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రామకృష్ణయ్య, వీఏఏలు సునీత కుమారి, రామ్మోహన్‌రెడ్డి, అరుణ, రైతులు పాల్గొన్నారు.

సామాజిక అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : సమాజంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి పాటుపడుతున్న స్వచ్ఛంద సంస్థలు ఎంతో కీలకమైనవని సంస్కృతి సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సెప్టెంబర్ 30న స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలంటే స్వచ్ఛంద సంస్థలు కూడా తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఆ మేరకు సంస్కృతి సేవా సమితి స్పందించింది. ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ విభాగానికి రెండు ఏసీలు, వైద్యుల సౌకర్యార్థం కార్యాలయ బెంచీలు సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కుండా నాగరాజు, మధుసూదన్‌బాబు, గురుకుమార్‌రెడ్డి, ఒంటేరు భాస్కర్‌రెడ్డి, హంసా ప్రతినిధి రాజా, శివ, షేక్‌షావలి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు మండలంలో భారీ వర్షం



నక్కలదిన్నె రోడ్డులో కూలిపోయిన భారీ వృక్షం

చాపాడు : మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడి భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4.50 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ భారీ వర్షం పడింది. ఈ వర్షం వలన పలు చోట్ల చెట్లు కూలిపోగా విద్యుత్ తీగలు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చాపాడులోని వైఎస్ విగ్రహం వద్ద కానుగ చెట్టు, నక్కలదిన్నెలో మరో భారీ వృక్షం పడిపోగా వాహనాలు వెళ్లేందుకు వీల్లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా వర్షాలు పడక ఎండలు విపరీతంగా కాయడంతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో గురువారం భారీ వర్షం పడటంతో ఒక్క సారిగా వాతావరణం చల్లపడిందని, పైర్లకు కూడా ఈ వర్షం మంచి చేస్తున్న రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



చాపాడులో వైఎస్ విగ్రహం వద్ద కూలిన కానుగ చెట్టు